క్లుప్తంగా

శశి కిరణ్‌కు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయ శాస్త్ర పరిశోధకురాలు పీఎస్ శశికిరణ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి గురువారం తెలిపారు. న్యాయ శాస్త్ర పరిశోధన పర్యవేక్షకులు డాక్టర్ కె.శ్రీగౌరి పర్యవేక్షణలో 'సైబర్ క్రైమ్ లాస్ వితిన్ ద క్రిమినల్ ఫ్రేమ్ వర్క్ ఇన్ ఇండియా: చేంజింగ్ పారాడిగ్మ్స్ అండ్ పర్‌స్పెక్టివ్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు గాను డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

చిన్నారుల స్నాతకోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: తల్లిదండ్రులు తమ బిడ్డల బంగారు భవిష్యత్తును పట్టభద్రులుగా చూసుకునే తొలి మెట్టు బాలల స్నాతకోత్సవమని ప్రజ్ఞ విద్యా సంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. గురువారం నగరంపాలెంలోని ప్రజ్ఞ మెడి టెక్నో పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసుకున్న బాల, బాలికలు ఒకటవ తరగతిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ బాలల స్నాతకోత్సవం నిర్వహించారు. పట్టభద్రుల మాదిరిగా చిన్నారులకు బ్లాక్ యాప్రాన్, క్యాప్ ధరింపజేసి పాస్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాయుడు కోటేశ్వరరావు ఉపాధ్యాయులు లలిత, మాధవి, యశోద పాల్గొన్నారు.

ఈసీజీ బండిల్స్, ట్యాప్‌ల వితరణ



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఉస్మాన్ గుండె జబ్బు రోగులకు అవసరమైన ఈసీజీ పరీక్ష చేసే బండిల్స్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌కు అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఆసుపత్రిలో నీటి లీకులను అరికట్టేందుకు అవసరమైన 50 ట్యాప్‌లను అందజేశారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోగులకు సేవలు చేయడంతోపాటు, వైద్య సేవలకు అవసరమయ్యే వైద్య పరికరాలను కూడా వితరణగా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం కలుగుతోందన్నారు.

మాస్టర్ మైండ్స్‌లో సీఏ ఫౌండేషన్ బ్యాచ్ ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: డిసెంబర్‌లో జరగనున్న సీఏ ఫౌండేషన్ పరీక్షలకు శుక్రవారం నూతన బ్యాచ్ ప్రారంభం కానున్నట్లు మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చదివిన ప్రతి విద్యార్థి అర్హులేనని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు కూడా సీఏ ఫౌండేషన్ కోర్సులో చక్కగా రాణించగలరని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో కూడా సీఏ కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 98851 25025, 98851 25026 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సమాఖ్య స్వభావాన్ని నీరు కార్చే జమిలి ఎన్నికలు



లక్ష్మీపురం: డబ్బు ఆదా పేరిట జమిలి ఎన్నికలను ప్రవేశ పెట్టాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తిని, సమాఖ్య స్వభావాన్ని నీరు కార్చటమేనని సీనియర్ అధ్యాపకులు ఎస్.తిరుపతయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన చర్చా గోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల అటు ప్రభుత్వానికి ఇటు పార్టీలకు ఎన్నికల ఖర్చు తగ్గుతుందన్న మాట నిజమే కాని, ఈ విధానం మన సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందనే విషయాన్ని మర్చి పోయారన్నారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ జమిలి ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల వ్యూహంలో వ్యయంలో జాతీయ పార్టీలతో రాష్ట్రస్థాయి పార్టీలు ధీటుగా నిలబడటం కష్టమే అన్నారు. ఈ క్రమంలో జాతీయ పార్టీలతో పాటు ముఖ్యంగా చిన్న పార్టీలు కనిపించకుండా పోతాయన్నారు. ఒక రకంగా ఈ జమిలి ఎన్నిక కేంద్రంలో చక్రం తిప్పుతున్న పార్టీలకే ఉపయోగపడుతుందన్నారు.

క్షయను జయిస్తున్నారు

ప్రాథమిక దశలోనే క్షయను గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడంతో బాధితులు వ్యాధిని జయిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలే ఇందుకు నిదర్శనం. అయితే మధ్యలో మందులు కోర్సును ఆపేయడం టీబీ ప్రాణాంతకంగా మారుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలా ఆపేసిన వారికి తొమ్మిది నెలల నుంచి రెండేళ్ల ఎండీఆర్(మల్టీ డ్రగ్ రెసిడెన్సియల్) చికిత్సను ప్రభుత్వం అందిస్తోంది. ఇందుకయ్యే ఖర్చును పూర్తిగా భరిస్తోంది. సకాలంలో వ్యాధి నిర్ధారణ, పూర్తిగా నయం అయ్యే వరకు మందుల కోర్సు వాడటం, పౌష్టికాహారం తీసుకోవడంతో.. టీబీపై బాధితులు విజయం సాధించవచ్చు.

- 24న వరల్డ్ టీబీడే
- పూర్తిస్థాయిలో మందులు వాడిన వారిదే విజయం
- మధ్యలో కోర్సు ఆపేసిన వారికి ఎండీఆర్ ట్రీట్‌మెంట్
- మొత్తం ఖర్చును భరిస్తున్న ప్రభుత్వం
- గుంటూరు జిల్లాలో 1,987 మంది బాధితులు
- 2025 నాటికి టీబీ అంతం లక్ష్యం..

అయినా టీబీ అలర్ట్..





క్షయవ్యాధిని తెలియజేసే పోస్టర్లు

గుంటూరు మెడికల్: భారతదేశంలో సంభవిస్తున్న మరణాల్లో క్షయవ్యాధి(టీబీ) మరణాలు ఎక్కువగా ఉన్నాయి. దేశంలో ఏటా 4.8 లక్షల మంది టీబీ బారిన పడి చనిపోతున్నారు. ప్రతి 12 నిమిషాలకు మరణాల సంఖ్య రెండుగా ఉంది. క్షయవ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియా ట్యూ బర్క్యులోసిస్‌ను 1862 మార్చి 24న బెర్లిన్‌కు చెందిన డాక్టర్ రాబర్ట్ కోచ్ కనుగొన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా ఏటా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

లక్షణాలు..

రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, దగ్గినప్పుడు రక్తం పడటం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గిపోవటం, ఆకలి మందగించటం, రాత్రి వేళల్లో జ్వరం రావటం, చమటలు పట్టడం క్షయవ్యాధి లక్షణాలు. వ్యాధి సోకిన వారు దగ్గినా, తుమ్మినా వారి నోటి తుంపరలు మీద పడటం ద్వారా వ్యాధి సోకుతుంది. ధూమపానం, మద్యపానం లాంటి చెడు వ్యసనాలు ఉన్నవారికి, హెచ్‌ఐవీ బాధితులకు టీబీ వ్యాధి సోకే ప్రమాదం ఉంది.

ఉచిత పరీక్షలు..

జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో టీబీ నిర్ధారణకు కళ్లె పరీక్ష కేంద్రాలున్నాయి. గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని జిల్లా క్షయ నివారణ కేంద్రం, గోరంట్లలోని ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రి, ఇబ్రాయిల్ పేట పట్టణ ఆరోగ్య కేంద్రం, పొన్నూరు, తెనాలి, మంగళగిరి, నుదురుపాడు, చేబ్రోలు, పెదపలకలూరు, తుళ్లూరు, పొన్నెకల్లు, సంగం జాగర్లమూడి, మంగళగిరి ఎన్నారై మెడికల్ కాలేజీ, నూతక్కి, తాడేపల్లి, మోరంపూడి, పెదనందిపాడు, కాటూరి మెడికల్ కాలేజ్, పెదకాకానిలలో కళ్లె పరీక్ష కేంద్రాలున్నాయి. వీటితో పాటుగా పది ఆసుపత్రుల్లో ఆర్టీపీసీఆర్ పరీక్ష కేంద్రాలు, మూడు ఆసుపత్రుల్లో సీబీ న్యాట్ పరీక్ష కేంద్రాలు, మూడు ఆసుపత్రుల్లో ఎక్స్‌రే కేంద్రాలు ఉన్నాయి.

జిల్లాలో క్షయ నిర్ధారణ పరీక్షలు, కోలుకున్నవారు

సంవత్సరం	నిర్ధారణ పరీక్షలు	బాధితులు	కోలుకున్నవారు
2021	19,928	4,784	4,784
2022	34,690	6,084	6,084
2023	41,892	5,565	4,173

టీబీ వ్యాధి నిర్ధారణ ఇలా..

గళ్ల పరీక్ష, ఎక్స్‌రే, ఆర్టీ పీసీఆర్, సీబీ న్యాట్ పరీక్షల ద్వారా టీబీ వ్యాధిని నిర్ధారించి, వ్యాధి ఉన్నవారికి మందులను ఉచితంగా అందజేస్తారు. మందులు ఆరు నెలల నుంచి ఎనిమిది నెలలపాటు క్రమం తప్పకుండా వాడాలి. మధ్యలో మందులు తీసుకోవడం ఆపివేస్తే వ్యాధి ముదిరిపోయి ప్రాణాంతకం అవుతుంది. అప్పుడు నయం చేయటం చాలా కష్టమవుతుంది. ఆరోగ్య కార్యకర్తలే బాధితుల ఇళ్ల వద్దకు వచ్చి మందులు అందజేస్తారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, మందులు వాడటం ద్వారా నయం చేయవచ్చు. ఒకసారి మందులు వాడి మధ్యలో ఆపేసిన వారికి ప్రభుత్వం 9 నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు ఎడీఆర్(మల్టీ డ్రగ్ రెసిడెన్సియల్) చికిత్స అందిస్తోంది. ఇందుకు సుమారు రూ.6 వేల నుంచి రూ.25 లక్షల ఖరీదు చేసే చికిత్సను ప్రభుత్వం టీబీ వ్యాధి బాధితులకు అందజేస్తోంది.

- 2024లో 1,987 మందికి వ్యాధి ఉన్నట్లు పరీక్షల్లో నిర్ధారణ జరిగి, వారు చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకునేందుకు 3,500 మందికి పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. అంతేకాకుండా ప్రతినెలా రూ.500లు చొప్పున క్షయ బాధితులకు ప్రభుత్వం పారితోషికం ఇస్తోంది.

సీబీ న్యాట్‌తో త్వరితగతిన వ్యాధి నిర్ధారణ



హెచ్‌ఐవీ ఉన్నవారిలో 80 శాతం మందికి క్షయ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ. పొగ తాగేవారికి, టీబీ రోగులకు వైద్యం అందించే వారికి, షుగర్ వ్యాధి ఉన్నవారికి మూడు శాతం టీబీ సోకే అవకాశాలు ఉన్నాయి. సీబీ న్యాట్ వైద్య పరికరం ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఈ విధానంలో కేవలం రెండు గంటల్లోనే టీబీ ఉందా లేదా నిర్ధారణ చేయవచ్చు.

– డాక్టర్ దాసరి శ్రీనివాసులు, జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి, గుంటూరు.

2025కు క్షయను అంతమొందించాలి



దేశ వ్యాప్తంగా 2025 నాటికి క్షయను భారత దేశం నుంచి అంతమొందించాలనే లక్ష్యంతో వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. క్షయ వ్యాధిపై అవగాహన కోసం మార్చి 24న గుంటూరు నగరంలో అవగాహన ర్యాలీలో ఏర్పాటు చేస్తున్నాం. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాం. ఐదేళ్ల నుంచి టీబీ కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. గుంటూరు జీజీహెచ్ శుశ్రుత హాలులో పలువురు శ్వాసకోశ వ్యాధి నిపుణులతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రజలు ఆదివారం జరిగే అవగాహన ర్యాలీ, కార్యక్రమంలో పాల్గొనాలి.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

నేడు రాష్ట్రస్థాయి సాఫ్ట్ స్కిల్స్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల ఆంగ్లశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ''డమ్ షరేడ్స్'' పేరుతో రాష్ట్రస్థాయి సాఫ్ట్ స్కిల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఒక్కో టీంకు ఇద్దరు చొప్పున, ప్రతి కళాశాల నుంచి రెండు టీంలు పాల్గొనవచ్చని వివరించారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థులు ఐడీ కార్డుతో పాటు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందని, మూకాభినయం ద్వారా ఇచ్చిన సామెతలను కనుగొనడంపై నిర్వహిస్తున్న పోటీలు ఉంటాయని తెలిపారు. గెలుపొందిన టీంలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రత్యేక బహుమతి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసి, ప్రోత్సహించే ఉద్దేశంతో పోటీలను నిర్వహిస్తున్నామని ఆంగ్ల శాఖ అధ్యక్షుడు పి. గోపీచంద్ తెలిపారు. వివరాలకు 99854 44686, 9966 893484 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: బాబాయిపై దాడిచేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు..కోబాల్ట్‌పేట 2వ లైనులో నివసించే జరుగుమళ్ల రాజశేఖర్ తన సోదరుడి కుమారుడు దిలీప్‌రాజును కుటుంబ వ్యవహారాల నేపథ్యంలో మందలించాడు.దీంతో దిలీప్‌రాజ్ బాబాయ్ రాజశేఖర్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరిదిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వదిన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడిచేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గుజ్జనగుండ్లకు చెందిన మైమూన్ తన భర్త మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తోంది. మరిది ఆదాం షఫీ తరచూ ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. గురువారం అతను దాడి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

స్థిర లక్ష్యంతో గమ్యం చేరుకోవాలి



విద్యార్థులతో డాక్టర్ తారకనాథ్, ఎస్వీ రమణ, లలిత, లక్ష్మీనారాయణ, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమలోని నైపుణ్యాలను అభివృద్ధి పరచుకుని, స్థిర లక్ష్యంతో గమ్యం చేరుకోవాలని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ వి.రామ తారకనాథ్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు మూడు రోజులపాటు స్పర్ధ–2024 పేరుతో నిర్వహించిన మేనేజ్‌మెంట్ ఫెస్ట్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథి డాక్టర్ తారకనాథ్ మాట్లాడారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ, సమగ్రమైన ఆలోచనా ధోరణితో ఉండటమే విజయానికి మూలమన్నారు. వేగంగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనించాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ.. మంచి మేనేజర్‌గా ఎదిగేందుకు విద్యార్థులకు స్పర్ధ వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా మాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్, బిజినెస్ క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, మార్కెట్ మేకర్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అదేవిధంగా యంగ్ మేనేజర్ పోటీలో ఎంబీఏ ప్రథమ సంవత్సర విద్యార్థులు కె.వెంకట కల్యాణ్, జి.ఆదిత్య సుమంత్ విన్నర్, రన్నర్లుగా నిలిచారు. కార్యక్రమంలో స్పర్ధ–2024 కన్వీనర్ వి. చక్రవర్తి, అసోసియేట్ ప్రొఫెసర్లు డి.కల్యాణి, ఎస్. గోపి శ్రీనివాసరావు, వి.అభిలాష్, కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర కె.లలిత, సహాయాచార్యులు ఎ.బాజీ బాబు, ఎస్. మణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకుల పురోగతిలో ఆడిటర్ల పాత్ర కీలకం



సదస్సులో జవహర్, సుబ్బారావు, ఐసీఏఐ గుంటూరు శాఖ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: బ్యాంకుల పురోగతిలో ఆడిటర్ల పాత్ర కీలకమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్ పేర్కొన్నారు. ఆడిటింగ్ అండ్ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ బోర్డు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సంయుక్తంగా గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్లో ఆడిటర్ల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జవహర్ మాట్లాడారు. ఆడిటర్స్, బ్యాంకర్స్ కలసి దేశ ఆర్థిక ప్రగతికి కృషి చేయాలన్నారు. ఎస్ఐఆర్‌సీ కార్యదర్శి ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ఆడిటర్లు బ్యాంకు ఆడిట్‌లో పాటించాల్సిన ముఖ్యమైన అంశాలు, తెలుసుకోవాల్సిన మెళకువలను వివరించారు. సదస్సులో ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ నూతలపాటి అమర్నాథ్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ, వైస్ చైర్మన్ చింతా వీఎస్ఎస్ రఘునందన్, కోశాధికారి వనిమిరెడ్డి వెంకట నరేష్, సికాస చైర్మన్ కన్నెగంటి మృత్యుంజయరావు, పూర్వ చైర్‌పర్సన్ వంగల భార్గవి, సీఏలు, ఆడిటర్లు పాల్గొన్నారు.

28 లోగా పన్ను వసూళ్లు పూర్తిచేయాలి

నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి



రెవెన్యూ అధికారులతో సమావేశమైన అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి

నెహ్రూ నగర్: నగర పాలక సంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులకు కేటాయించిన లక్ష్యాలను మార్చి 28 నాటికి పూర్తిచేయాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి ఆదేశించారు.

రెవెన్యూ వసూళ్లపై గురువారం ఉదయం కమిషనర్ చాంబరులో డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఆర్ఐలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ వరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వారీగా పన్ను వసూళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా నగర పాలక సంస్థ ప్రైవేటు డిమాండ్ ద్వారా రూ.63 కోట్లు వసూలు చేయాల్సిన ఉందని తేల్చారు. రూ.33 కోట్లలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వారీగా టార్గెట్ విధించారు. వార్డు అడ్మిన్ సెక్రటరీలు ప్రతి ఒక్కరూ ఉదయం 8 గంటల కల్లా పన్ను వసూలుకు వార్డుల్లో తిరిగేలా చూడాలన్నారు. పెద్ద మొత్తంలో ఉన్న పన్ను బకాయిల వసూలు కోసం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు, డెప్యూటీ కమిషనర్లు కూడా పాల్గొని, లక్ష్యాలను అధిగ మించాలని స్పష్టం చేశారు. ప్రతి రోజూ సాయంత్రం రెవెన్యూ వసూళ్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఖాళీ స్థలం పన్ను బకాయిలపై సమీక్షించి, వడ్డీ రాయితీ ఉన్నందున యజమానులకు అవగాహన కల్పించాలని ఏసీ వివరించారు. ఖాళీ స్థలం పన్ను వసూళ్లు నూరుశాతం జరిగేలా చూడాలన్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు ఖాళీ స్థల పన్ను బకాయిలు ఉన్న గృహ యజమానుల వివరాలు అందించాలని, ప్లానింగ్ సెక్రటరీలతో కలిసి త్వరితగతిన పన్ను వసూళ్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు చెరువు శ్రీనివాస్, వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాష, సాంబశివరావు, రెహమాన్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీల విషయంలో దాడి

గుంటూరు ఈస్ట్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ వ్యక్తి ఇద్దరిపై దాడిచేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. స్తంభాల గరువుకు చెందిన వినుకొండ సాంబ శివరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. షేక్ యూసఫ్‌కు, సాంబశివరావుకు ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో గురువారం గొడవ జరిగింది. యూసఫ్ వినుకొండ సాంబ శివరావుపై దాడిచేశాడు. అడ్డు వచ్చిన విజయ్‌పైన దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గరుడ వాహనంపై శ్రీవారి నగరోత్సవం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా గురువారం స్వామికి ఉదయం హనుమత్ వాహనం, సాయంత్రం గరుడ వాహనంపై నగరోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉత్సవ మూర్తులను ఉంచి, విద్యుద్దీప కాంతులు, బాణసంచా వెలుగులు, మంగళ వాయిద్యాల నడుమ నగరంలోని ప్రధాన వీధుల్లో నగరోత్సవం సాగింది. ఈ సందర్భంగా సభకు ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామి, శేషాచల ఆశ్రమం పీఠాధిపతి నిర్వికల్పానంద స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ముఖ్య అతిథులు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, రాష్ట్ర వైద్యశాఖ మంత్రి విడదల రజిని, సాహితీవేత్తలు ఎంవీ సత్యవతి, నోరి నారాయణమూర్తి, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, బొల్లేపల్లి సత్యనారాయణ, సూర్యదేవర వెంకటేశ్వరరావు, లంకా విజయబాబు, బొర్రా ఉమామహేశ్వరరావు, లంకా సూర్యనారాయణ, ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ పేర్కొన్నారు. యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 24వ వర్ధంతి సందర్భంగా గురువారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణ కావడంతో సమాజ పతనానికి దారి తీస్తోందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, ఎం.గోవిందయ్య, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, ఎం.ధనరాజారావు, కె. రంగారావు పాల్గొన్నారు.

క్విజ్‌తో సృజనాత్మకతకు పదును



మాట్లాడుతున్న అధ్యాపకుడు రామిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: క్విజ్ పోటీలతో సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టవచ్చునని హిందూ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ బి.రామిరెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజీపీఎస్ డిగ్రీ కళాశాల గణితశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో గురువారం ఏఎన్‌యూ అంతర్ కళాశాలల క్విజ్ పోటీలను మాథోఫీలియా–2024 పేరుతో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రామిరెడ్డి పాల్గొని, మాట్లాడారు. మానవుని నిత్య జీవితంలో గణితం చాలా ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. కేవీ బ్రహ్మం మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి పోటీ ప్రపంచంలో ధైర్యంగా పాల్గొని, విజయమార్గం వైపు ముందుకెళ్లాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ క్విజ్‌లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, రీజనింగ్, కరెంట్ అఫైర్స్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్ అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. క్విజ్ పోటీల్లో ప్రభుత్వ మహిళా కళాశాల, హిందూ కళాశాల విద్యార్థి బృందాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వరుసగా రూ.2వేలు, రూ.1,500 చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల గణిత విభాగాధిపతి కె.కవిత, అధ్యాపకులు ఆర్.స్వామి, డాక్టర్ జీవీ సుధీర్ కుమార్, ఎం.అమూల్య, పి.కుమార్‌రాజా, జి. సురేష్ కుమార్, బి.జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

దుష్పరిణామాల్లేని శారీరక వైద్యం ఫిజియోథెరపీ



ఫిజియోథెరపీ ఉపయోగాలను తెలియజేస్తున్న డాక్టర్ సుజాత

లక్ష్మీపురం: ఫిజియో థెరపీ ఒక శారీరక చికిత్స అని, ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్ లేని శారీరక వైద్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వి.సుజాత అన్నారు. స్థానిక అరండల్ పేటలో అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడారు. కారణాలు ఏవైనా మానసికంగా, శారీరకంగా కృంగిపోయే రోగుల వికాసానికి సంజీవని వలే స్వాంతన చేకూర్చేది ఫిజియోథెరపీ అన్నారు. ఏదైనా అనారోగ్యం లేదా గాయం తర్వాత శరీరం తిరిగి మాములుగా అయి రోగి తన విధులను సక్రమంగా చేసుకునేలా చేయగలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌లకు శిక్షణ తరగతులు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని ప్రివెంటివ్ మెడిసిన్ రీజినల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీలో గురువారం వాటర్, ఫుడ్ ఎనాలసిస్‌పై ల్యాబ్ టెక్నీషియన్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథి రీజినల్ ల్యాబ్ సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్ట్, ఇన్‌చార్జి ఆర్డీ డాక్టర్ జి.శోభరాణి మాట్లాడారు. ల్యాబ్ టెక్నీషియన్‌లకు నూతన వైద్య పద్ధతుల నేర్చుకునేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. గత నెలలో గుంటూరులో అవుట్ బ్రేక్ అకడమిక్ వచ్చినప్పుడు రీజినల్ ల్యాబ్ సిబ్బంది సమష్టిగా పనిచేసి 972 శాంపిల్స్ సేకరించారని గుర్తుచేశారు. ఇది రీజినల్ లేబొరేటరీలో అత్యధిక సంఖ్యలో శాంపిల్స్ సేకరణగా పేర్కొన్నారు. అత్యధిక శాంపిల్స్ సేకరించి, రాష్ట్రంలోనే ఇతర రీజినల్ ల్యాబ్‌లకు గుంటూరు ల్యాబ్ మార్గదర్శకంగా నిలిచిందన్నారు. కొత్తగా ల్యాబ్‌లో చేరిన వారు మెళకువలు నేర్చుకుని సకాలంలో ఖచ్చితమైన ఫలితాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వాటర్ ఎనలిస్ట్ వినుకొండ రాజారావు, జె.విజయకుమారి, జూనియర్ ఎనలిస్ట్ కె.జయప్రకాష్, జయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ భాస్కరరావు, రామకృష్ణ, నాగేశ్వరరెడ్డి, ధనలక్ష్మి, శాంపిల్ టేకర్స్ వాణి, శివకుమార్, డాక్టర్ సిరాజుద్దీన్, డాక్టర్ శారదా, నాగేశ్వరరావు, కల్యాణి పాల్గొన్నారు.